క్లుప్తంగా

వెంకన్నకు రూ.7.61 లక్షల ఆదాయం

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురం వేంకటేశ్వర స్వామి హుండీలను సోమవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 62 రోజుల వ్యవధికి గాను రూ.7.61 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తారకేశ్వరరావు తెలిపారు. దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణికుమార్ పర్యవేక్షణలో ఈ హుండీలు లెక్కించారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శ



సత్యనారాయణ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని పి.వెంకటాపురం గ్రామ సర్పంచ్ పెంకే లక్ష్మి, ఆమె కుమారుడు, ఉపసర్పంచ్ సోమరాజులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం పరామర్శించారు. సర్పంచ్ లక్ష్మి భర్త సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కన్నబాబు ఓదార్చారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ అధ్యక్షులు



ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుమార్‌రాజాను అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చింతల రాజు సోమవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబును కలిశారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కన్నబాబు వారిని దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు.

వీరభద్రుని గద్దె సంబరం



సర్పవరంలో వీరభద్రుని ఊరేగింపు

కాకినాడ రూరల్: సర్పవరంలో సత్తెమ్మతల్లి ఆలయం వద్ద వీరభద్రుని గద్దె సంబరం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన కోమర్తి దుర్గాప్రసాద్, సాయి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో వీరభద్రుని గద్దె సంబరం 18 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం నిర్వహించిన సంబరానికి వివిధ ప్రాంతాలకు చెందినవారు హాజరయ్యారు. వీరంతా వీరభద్రుడు గద్దెలను తలపై ఉంచుకుని గ్రామం అంతా ఊరేగించి శివాలయం వద్ద పూజ అనంతరం తిరిగి గద్దె వద్దకు చేరుకున్నారు. వేలాదిగా వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

మట్టి అక్రమ నిల్వపై దాడి



కరపలోని లేఅవుట్‌కు తరలించేందుకు పొక్లెయిన్‌తో ట్రాక్టర్‌లో మట్టిని వేస్తున్న దృశ్యం

కరప: మండలంలోని అరట్లకట్ట గ్రామంలో పంటకాలువ పూడికతీత పేరుతో వచ్చిన మట్టిని అమ్ముకునేందుకు ఒక అక్రమార్కుడు నిల్వ ఉంచాడు. సమాచారం అందడంతో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్‌ఐ పేపకాయల మాచర్రావు ఇతర సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేసి, మట్టిని స్వాధీనం చేసుకున్నారు. ఆ మట్టిని కరపలోని జగనన్నకాలనీ (ఒకటవ లేఅవుట్)లోకి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఆ మట్టిని 38 సెంట్ల భూమి మెరక చేసేందుకు వినియోగించినట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

అన్న సమారాధన

కరప: మండలం కొరుపల్లి పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. గ్రామంలోని శివాలయం ఆరవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త దేవిశెట్టి అప్పలరాజు స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో కొరిపల్లి పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు దేవిశెట్టి సూర్యప్రకాశరావు, ఆలయ కమిటీ సభ్యులు తిబిరిశెట్టి గజేంద్రుడు, అద్దంకి బాపనయ్య, పలివెల వెంకటసూర్యనారాయణ, సమనాసి ఏడుకొండలు, రెడ్డి రామకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కుంటుపడ్డ కుట్టు పని

- ఆదరణ కోల్పోతున్న దర్జీలు
- జగనన్న చేదోడు ద్వారా భరోసా
- నేడు టైలర్స్ డే



కరపలోని ఒక టైలరింగ్ షాపులో..

కరప: ఒకప్పుడు దర్జాగా సాగిన దర్జీ వృత్తి నేడు క్రమంగా ఆదరణ కోల్పోతోంది. సినీ హీరోలకు ఆకర్షణీయంగా దుస్తులు కుట్టిన యాక్స్ వంటి టైలర్లకు కూడా నటులకు దీటుగా ఎంతో పేరుండేది. దర్జీ వృత్తి చేసేవారు, సహాయకులు, కుట్టు మెటీరియల్ విక్రయించే వారు ఇలా అనేక మంది ఈ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఆధునిక ప్రపంచంలో వ్యక్తుల అభిరుచుల్లో వచ్చిన మార్పులు, వస్త్ర వ్యాపారంలో సాంకేతిక విప్లవం వంటి కారణాలతో టైలరింగ్ వృత్తి ప్రశ్నార్థకంగా మారింది. టైలర్లనుకానీ, ఈ వృత్తిపై ఆధారపడివారిని కానీ ఇంతవరకూ ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎవరూ చేయనివిధంగా జగనన్న చేదోడు పథకం ద్వారా మూడేళ్లుగా టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు వంతున సాయమందిస్తున్నందుకు సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా ఫిబ్రవరి 28న టైలర్స్‌డే జరుపుకుంటారు.

పట్టణాలకు వలస

కరప మండలంలో 23 గ్రామాల్లో సుమారు 300 నుంచి 350 మంది వరకు టైలర్లు ఉండగా వారిలో 110 మంది మహిళలుంటారు. ఒకప్పుడు కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి జీవించేవారు. చేతినిండా పని కరువవడంతో షాపింగ్‌మాల్స్‌లో పనిచేసేందుకు టైలరింగ్ వృత్తిపని వారు పట్టణాలకు వలసపోతున్నారు. వృత్తి సహాయకులైతే వస్త్ర దుకాణాల్లో పనిచేయడం, సైకిళ్లపై వస్త్రాలను అమ్మడం వంటి పనులు చేస్తున్నారు. వినాయక చవితి, దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి, వివాహాది శుభకార్యాల సమయంలోనే పని ఉంటుందని మిగిలిన రోజుల్లో షాపు అద్దె, కరెంటు చార్జీలు, కుటుంబ పోషణ భారమవుతోందని టైలర్లు అంటున్నారు. టైలర్లు ఆదరణ కోల్పోవటంతో, కొత్తగా ఈ వృత్తి నేర్చుకోవడానికి నేటితరం ముందుకురావడంలేదు. ఇదే వృత్తిలో కొనసాగాలనుకునేవారికి సహాయకులు కరువవుతున్నారని సీనియర్ టైలర్లు అంటున్నారు. టైలరింగ్ మెటీరియల్ ధరలు పెరిగిపోవడంతో, కుట్టుకూలీ రేటు పెంచాల్సి వస్తోందని దీంతో వినియోగదారులకు భారమవుతోందని అంటున్నారు. భవన నిర్మాణ, కల్లుగీత కార్మికులకు మాదిరిగానే టైలర్లకు కూడా గుర్తింపుకార్డులిచ్చి ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు.

టైలర్లకు పింఛన్ ఇవ్వాలి



మత్స్యకార, చేనేత, కల్లుగీత కార్మికులకు ఇస్తున్నట్టుగానే ప్రభుత్వం స్పందించి 50 ఏళ్లునిండిన టైలర్లకు కూడా ఫింఛన్ ఇవ్వాలి. బ్యాంక్‌ల ద్వారా రాయితీపై రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

కొనసా రాజగోపాల్, సూపర్ టైలర్, కరప

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



చిన్నప్పటి నుంచి ఇదే వృత్తిలో ఉండటంతో వేరే పని చేయలేక, కష్టంగా ఉంటున్నా టైలరింగ్ ద్వారానే జీవనం సాగిస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్ ఏడాదికి రూ.10 వేలు వంతున ఆర్థిక సాయమందించి ఆదుకుంటున్నారు. ఇళ్ల స్థలాలు కూడా మంజూరు చేసి, సొంతింటి కలను సాకారం చేయాలి.

– దార్నా వీర్రాజు, సత్యసాయి టైలర్, వేళంగి

102 మందికి జగనన్న చేదోడు



గతేడాది జగనన్న చేదోడు పథకం ద్వారా మండలంలో 102 మందికి రూ.10 వేల వంతున సాయం అందించాం. ఈ ఏడాది టైలర్ల వివరాలు సేకరించి, సాయమందించే చర్యలు తీసుకుంటున్నాం.

– కర్రె స్వప్న, ఎంపీడీఓ, కరప మండలం

లక్ష్య సాధనకు కష్టపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

కరప: విద్యార్థులు కష్టపడి చదివితే ఏర్పరచుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం బీఆర్‌వీ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కెరీర్ గైడెన్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అదే కళాశాల నుంచి వచ్చిన మరో వక్త హెడ్‌ఆఫ్ ఇంగ్లిషు డిపార్ట్‌మెంట్ పీవీ కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యసాధనకు కష్టపడి చదవాలన్నారు. రోజూ వార్తా పత్రికలు చదవాలని, పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి జీకే, వివిధ రకాల కెరీర్ పోర్టల్‌ను పరిశీలన చేస్తూ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. మేధావులందరూ గ్రామీణ ప్రాంతాలవారేనని తెలిపి, వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, వీవీ రమణమూర్తి, జి.అర్జునరావు పాల్గొన్నారు.

అఖిలపక్షం నేతల అరెస్ట్



నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కాకినాడ సిటీ: పరిశ్రమల్లో కార్మికులకు జీవితాలకు భద్రత కల్పించాలని, కార్మికుల ప్రాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాలు, దళిత సంఘాలు, ప్రజాసంఘాలు చేపట్టిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. కలెక్టరేట్‌కు తరలివెళ్తున్న అఖిలపక్షం నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి పోర్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చెక్కల రాజ్‌కుమార్, తోకలప్రసాద్, జల్లూరి వెంకటేశ్వరరావు, తాళ్లూరి రాజు, గదుల సాయిబాబు, గుబ్బల ఆదినారాయణ, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమన, మలకా రమణ పాల్గొన్నారు.

4న సత్యాత్మ తీర్థ స్వామిజీ రాక

బోట్‌క్లబ్: మధ్వాచార్య మూల మహాసంస్థానం ఉత్తరాధి మఠ పీఠాధిపతి సత్యాత్మ తీర్థ స్వామిజీ మార్చి 4వ తేదీ నుంచి మూడు రోజులపాటు కాకినాడలో పర్యటిస్తారని సుధా పండితులు విజయసింహాచార్ తెలిపారు. స్వామిజీ పర్యటన ఏర్పాట్లను సోమవారం రామారావుపేట మధ్వసభలో కమిటీ సభ్యులతో కలిసి సమీక్షించారు. స్వామిజీ ఉత్తర భారత పర్యటన ముగించుకొని ఆంధ్రా ప్రాంతానికి వస్తున్నారన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మీదుగా మార్చి 4న కాకినాడ చేరుకొంటారన్నారు. స్వామిజీ వెంట సుధాపండితులు, వేద విద్యార్థులు వస్తారన్నారు. కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్రస్వామి మాట్లాడుతూ సుదీర్ఘకాలం తర్వాత స్వామిజీ నగరానికి వస్తున్నారని వారికి ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మధ్వసభ కార్యవర్గ సభ్యులు కోపెల్ల శేషగిరిరావు, పరశురామ్, వేముగంటి రాము, రాచూరి శేషగిరిరావు, జమ్మి కృష్ణారావు పాల్గొన్నారు.

నిరుపేద క్రీడాకారులకు చేయూత

బాలాజీచెరువు: క్రీడలలో ప్రతిభతో పాటు పోలీస్, ఆర్మీ వంటి ఫిజికల్ పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుపేదలకు చేయూత ఇస్తానని హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. టూ టౌన్‌లోని తన కార్యాలయంలో ముగ్గురు గిరిజన యువకులకు ఆయన సోమవారం స్పోర్ట్స్ సామగ్రి అందజేశారు. అవసరమైన వారికి తన ట్రస్ట్ ద్వారా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

‘నెట్‌వర్క్’లో జీజీహెచ్ సిబ్బంది



డాక్టర్ బుద్ధాను సత్కరిస్తున్న చిత్ర యూనిట్

కాకినాడ క్రైం: కొద్ది రోజులుగా కాకినాడ జీజీహెచ్‌లో ‘నెట్‌వర్క్’ పేరుతో థ్రిల్లర్ కథాంశంతో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న విషయం విదితమే. వెబ్‌సిరీస్‌గా సుమారు రూ.రెండు కోట్ల వ్యయంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కాకినాడ జీజీహెచ్ సిబ్బంది ప్రధాన పాత్రల్లో నటిస్తూండడం విశేషం. హీరోగా, ఆసుపత్రి ఉన్నతాధికారిగా జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ బుద్ధా నటిస్తుండగా మరో మూడు కీలక పాత్రలు, పోరాట సన్నివేశాల్లో సూపర్‌వైజర్ బాబ్జీ, అవుట్ సోర్సింగ్ సిబ్బంది శ్రీకాంత్, నరేంద్ర నటిస్తున్నారు. చిత్రీకరణ అనంతరం డాక్టర్ బుద్ధాను చిత్ర యూనిట్ సత్కరించింది.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కాకినాడ రూరల్: చీడిగలో గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ విద్యుత్ తీగలు తగలడంతో దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వివరాల ప్రకారం ఓవర్‌లోడ్‌తో గడ్డిని ట్రాక్టర్‌పై వేసుకుని వెళ్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.70వేల ఆస్తినష్టం జరిగింది. విద్యుత్ తీగలను గడ్డి తాకడంతోనే ప్రమాదం జరిగిందని అగ్నిమాపక అధికారి ఏసుబాబు తెలిపారు.

డ్రైవర్లపై వేధింపులు ఆపాలి



క్లాప్ వాహన డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న వీరబాబు

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహన డ్రైవర్లపై వేధింపులు ఆపాలని, పని ఒత్తిడి తగ్గించాలని క్లాప్ వాహన డ్రైవర్ల సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం జగన్నాథపురం వాహనాల యార్డు వద్ద జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నాయకులు మాట్లాడారు. కొంతమంది అధికారులు క్లాప్ డ్రైవర్లను వేధిస్తున్నారన్నారు. వారాంతపు సెలవులు అమలు చేయాలని, ఇన్సూరెన్స్ చేయించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, ఎం.శివశంకర్, గంగాధర్, శ్రీనివాస్, నానిబాబు, సూరిబాబు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళులు

కాకినాడ సిటీ: భగత్‌సింగ్ అనుచరుడు, స్వాతంత్య్ర సమరయోధుడు కామ్రేడ్ చంద్రశేఖర్ ఆజాద్ 93వ వర్ధంతిని సోమవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. నాయకులు చెక్కల రాజ్‌కుమార్, జి.బేబీరాణి, దువ్వా శేషుబాబ్జీ, చంద్రావతి, రమణమ్మ, దాడి బేబీ, తలారి నాగమణి, మిరియాల రాజేశ్వరి, ధనలక్ష్మి, మేరీ సమాధానం, సీహెచ్ రమ పాల్గొన్నారు.

మంచి కెరీర్‌తోనే జీవితంలో గుర్తింపు



సమావేశంలో మహోన్నత్‌ను సత్కరించిన ఉపాధ్యాయులు

సామర్లకోట: మంచి కెరీర్‌తోనే జీవితంలో గుర్తింపు వస్తుందని వైద్యులు మహోన్నత్ అన్నారు. కెరీర్ గైడెన్సు డే సందర్భంగా స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ అతిథిగా పాల్గొన్నారు. కెరీర్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించారు. విద్యా కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, స్పందన ఈదా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి మూర్తి, సభ్యులు టీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టరు మహోన్నత్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు.

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కెరీర్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కెరీర్ డే ఆకారంలో కూర్చుని కెరీర్ డే ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత లెక్చరర్ కె.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు కె.నూకరాజు, విద్యా కమిటీ చైర్మన్ వి.రాంబాబు, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవాలు

కొత్తపల్లి: కొండెవరంలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి 60వ కల్యాణ మహోత్సవాలను మార్చి 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలు 2వ తేదీ నుంచి 6 వరకూ జరగనున్నాయి.

సమస్యల పరిష్కారానికే ‘స్పందన’



స్పందనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రజలు ఎదుర్కొనే స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారమవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఏడు వినతులు స్వీకరించారు. పారిశుధ్యం, మంచినీరు, వీధి దీపాలు వంటి సమస్యలను స్పందన కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని సూచించారు. కాగా పారిశుధ్యం, డ్రైనేజీలలో సిల్ట్, రోడ్లపై వేసిన భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపు వంటి అంశాలపై ప్రజలు స్పందనలో దరఖాస్తులు అందజేశారు. మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడువులోపు అర్జీల పరిష్కారం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ తదితరులు

కాకినాడ సిటీ: నిర్దేశిత గడువులోపు స్పందన దరఖాస్తులు పరిష్కరించాలని కాకినాడ ఆర్డీవో బీవీ రమణ అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన డివిజనల్ స్థాయి అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి 22 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పాతంశెట్టి నారాయణమూర్తి ఏపీడీఎస్‌ఆర్‌జీఈఎస్ వసంత మాధవి, డివిజనల్ వ్యవసాయ అధికారి పద్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చౌదరి పాల్గొన్నారు.

అర్జీదారులు ఐదుగురికి ఉద్యోగాలు

కాకినాడ సిటీ: కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న ఐదుగురికి వికాస ద్వారా ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో అవకాశం కల్పించారు. వీరు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో వి.వెంకటేష్, అసిస్టెంట్ హెచ్‌ఆర్‌గా రూ.17 వేలు, ఎస్.లక్ష్మణ్, వై.వీరాంజనేయ, జి.సాయిదుర్గాభవని, ఎం.రేణుక రూ.10 వేలు వేతనంతో జూనియర్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. జేసీ ఇలక్కియ, డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు పాల్గొన్నారు.

సమన్వయం లేకపోతే చులకన అవుతాం

నెల్లూరు ట్రాన్స్‌జెండర్ దాష్టీకాన్ని నిరసిస్తూ టీజీల సమావేశం



సమావేశంలో పాల్గొన్న ట్రాన్స్‌జెండర్లు

కాకినాడ క్రైం: నెల్లూరుకు చెందిన హాసిని అనే ట్రాన్స్‌జెండర్ (టీజీ) ఆగడాలను నిరసిస్తూ పలు ప్రాంతాల టీజీలు ఏకమయ్యారు. కార్యాచరణలో భాగంగా సమన్వయ సమావేశం నిర్వహించారు. కాకినాడలోని ఎంఎస్ఎన్ చారిటీస్ సమీపంలో ఉన్న కొండబాబు కల్యాణ మంటపంలో సోమవారం ఈ సమావేశం జరిగింది. కాకినాడ సహా, రాజమండ్రి, గుడివాడ, విజయవాడ, గుంటూరుతో పాటు రాష్ట్రంలో పలు ప్రాంతాలకు చెందిన ట్రాన్స్‌జెండర్‌లు పాల్గొన్నారు. కాకినాడ టీజీల నాయకురాలు తాటిపాక సిమ్రాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల నాయకులు మాట్లాడుతూ ఏ ప్రాంతానికి చెందిన టీజీలు అయినా బతుకు తెరువు కోసం నెల్లూరుకు వెళుతుంటే అక్కడ హాసిని అనే టీజీ వారి పట్ల అమానవీయంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ సహా పలు ప్రాంతాలకు చెందిన టీజీలను దారుణంగా కొట్టి వెనక్కి పంపిందని అన్నారు. ట్రాన్స్‌జెండర్ల మధ్య సమన్వయం లేకపోతే సమాజంలో మరింత చులకన అవుతామనీ, ఈ విషయం హాసినికి చేరేలా సభాముఖంగా విన్నవిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

ఘనంగా కెరీర్ డే



కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కరప: అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం పి.సత్యానారాయణ అధ్యక్షతన కెరీర్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కెరీర్ గైడెన్స్ ఆఫీసర్ బావిశెట్టి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు శ్రమించాలన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ మహేష్, వెటర్నరీ డాక్టర్ తిరుమలరావు తాము ఉద్యోగాలు ఎలా సాధించారో వివరించి, అవగాహన కల్పించారు. ఎన్ఆర్ఐ సానా వెంకటాద్రినాయుడు ఫోన్‌లో మాట్లాడి ఉన్నత లక్ష్యాలు ఎలా చేరుకోవాలో వివరించి, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తికి ఆరునెలల జైలు

రూ.2 లక్షల జరిమానా

కాకినాడ లీగల్: మద్యం సీసాలను తరలిస్తున్న ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎం.మాధవి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన శెట్టి గోవిందరాజు గత ఏడాది డిసెంబర్ 12న కాకినాడ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వెనుక వీధిలో పాత పోస్టాఫీస్ వద్ద నాలుగు మద్యం సీసాలను తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎస్సై గుణశేఖర్ కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో గోవిందరాజుపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ సీహెచ్ జగదీష్‌కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

అపర్ణాదేవీ.. నమామ్యహం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉన్న అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం కుంకుమ పూజలు కన్నుల పండువగా జరిగాయి. సుమారు మూడు వేల మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రిల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజలకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట భీమేశ్వరస్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. ఫాల్గుణమాసం, స్వామివారికి ప్రీతైన సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జామున స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పూజల అనంతరం స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కందరాడ విద్యార్థి



దుర్గాప్రసాద్

పిఠాపురం: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పిఠాపురం మండలం కందరాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి మడగం దుర్గాప్రసాద్ ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు తెలిపారు. అండర్–14 విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన దుర్గాప్రసాద్ సోమవారం నుంచి మార్చి ఒకటో తేదీ వరకూ చిత్తూరు జిల్లా నగరిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాడని ఆయన తెలిపారు. విద్యార్థిని, తనకు తర్ఫీదు ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.సుబ్బారావును గ్రామపెద్దలు అభినందించారు.